# పరిచయము

## (1 సమూ. 16)

మే 12, 1974, ఆదివారం ఉదయం ఇటలీలోని ఫ్లోరెన్స్ ప్రభువు సంఘంలో నేను నా కుటుంబం ఆరాధించాం. ఆరాధన అయిన వెంటనే, ఫ్లోరెన్స్‌లోని ఎర్ల్ ఎడ్వార్డ్స్ అనే మిషినెరీ తన కారువద్దకు రమ్మని మమ్ము తొందరపెట్టాడు. ఘోరమైన వేగంతో కారు నడుపుతూ, "మ్యూజియమ్ రెండు గంటలకు మూసేస్తారు, మంగళవారం మీరు ఉండరు, సోమవారం అది తెరవబడదు!" అని వివరించాడు. దేవుని కృపవలన ఏ యిబ్బంది కలుగకుండగనే, గల్లేరియా డెల్ ఎకాడెమియాకు చేరుకున్నాం.

మైకిలేంజిలియాచే పాక్షికంగా పూర్తిచేయబడిన శిల్పాలతో నిండిన హాలుగుండా మేము నడుస్తూ, లోపలికి వెళ్లగా, కటిక బండలోనుండి శిల్పాలను చెక్కడం నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. అప్పుడు మేము పెద్ద గదిలోనికి వెళ్లాం. మా ఎదుట బ్రహ్మాండమైన పదనాలుగు అడుగుల ఎత్తు ప్రతిమ నిలిచియుంది. దానిని మైకిలేంజిలియో యొక్క సంపూర్ణ సామర్థ్యాన్ని తెలిపేదిగా అనేకులు భావించేవారు: అది దావీదు ప్రతిమ.

యువకుడైన దావీదు శత్రువుని ఎదుర్కొంటున్న విగ్రహమది. అతని నుదురు బీటలుబారి ఉంది, అతని కోపాన్ని కనబరచే కన్నులు శత్రువుపై దృష్టి నిలిపాయి. అతని ఒడిసెల భుజానికి అడ్డంగా తగిలి ఉంది. అతని దేహం బిగుసుకుంది. కాని కలత లేదు. జయం కలుగుతుందనడానికి సందేహం లేదు. అతడు పీల్చే గాలికి వక్షం ఉప్పొంగినట్టు, పెదవులు దృఢ విశ్వాసాన్ని పలుకుతున్నట్టు శిల్పి ఎంతో నేర్పుగా చెక్కాడు: "నీవు కత్తియు ఈటెయు బల్లెమును ధరించుకొని నా మీదికి వచ్చుచున్నావు అయితే నీవు తిరస్కరించిన.... సైన్యములకధిపతియగు యెహోవా పేరట నేను నీమీదికి వచ్చుచున్నాను.... యుద్ధము యెహోవాది..... ఈ దినమున (ఆయన) యెహోవా నిన్ను నా చేతికి అప్పగించును" (1 సమూ. 17:45, 47) అన్నట్టు ఉంది. ఎర్ల్ ఎడ్వార్డ్స్ తొందరగా మమ్ము మ్యూజియంకు తోడుకొని వచ్చాడు ఎందుకంటే, దావీదు బొమ్మను చూడకుండ ఫ్లోరెన్స్ ట్రిప్పు కంప్లీట్ కాదని అతనికి తెలుసు.

ఆ ప్రతిమ ఎంతటి మహనీయమైనదైనా, – దావీదు అనే అంశాన్ని తప్పిస్తే ఆ ప్రతిమ వెల్లబోతుంది. కారణమేమంటే – అతని జీవిత గాథను తెలపడానికి పాత నిబంధనలో అరవైయ్యారు అధ్యాయాలు పట్టాయి, ఆ మానవుడు క్రొత్త నిబంధనలో ఏభై తొమ్మిది సార్లు ప్రస్తావించబడ్డాడు, "దేవుని చిత్తానుసారమైన మనస్సుగలవాడని" బైబిల్లో పిలువబడిన వ్యక్తి అతడొక్కడే.

1 సమూ. 13:14లో సౌలు రాజుగా ఉండకుండ నిరాకరించబడిన తరువాత, సమూయేలు యిలా అన్నాడు, "అయితే నీ రాజ్యము నిలువదు. యెహోవా తన చిత్తానుసారమైన మనస్సుగల ఒకని కనుగొన్నాడు. నీవు ఆజ్ఞాపించిన దాని నీవు గైకొనకపోతివి గనుక యెహోవా తన జనములమీద అతనిని అధిపతినిగా

నియమించును." అపొ. 13లో పిసిదియాలోని అంతియొకయలో పౌలు ప్రసంగించుతూ, సౌలును గూర్చి మాట్లాడిన తరువాత యిలా అన్నాడు: "తరువాత అతనిని తొలగించి దావీదును వారికి రాజుగా నియమించెను. మరియు ఆయన–నేను యెష్షయి కుమారుడగు దావీదును కనుగొంటిని; అతడు నా యిష్టానుసారుడైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశములన్నియు నెరవేర్చునని చెప్పి అతనిని గూర్చి సాక్ష్యమిచ్చెను" (22 వ.).

దావీదు జీవితాన్ని గూర్చిన అధ్యాయాలు అతని హృదయాన్ని కేంద్రీకరించి మాట్లాడినంతగా అతని చరిత్రను గూర్చి మాట్లాడలేదు.

"దేవుని హృదయానుసారుడు" అంటే అర్థమేమి? ఈ మాటలు పరిపూర్ణతను సూచిస్తున్నాయా? లేదు. దావీదు మ్యూజియంలోని చలువరాతి సెయింట్ కాదు. వేడి రక్తం అతని నాళాలలో ప్రవహించింది, తీవ్ర వాంఛలు అతని శరీరంలో ప్రబలాయి. అనేకులు ఎగురలేనంత ఎత్తుకు ఎగిరాడు, భయంకరంగాను పడిపోయాడు.

ఒకని హృదయం దేవుని హృదయానికి అనుకూలంగా ఉందని ఆ ప్రయోగ భావమై ఉంది. "నా హృదయానికి అనుకూలంగానే ఉన్న మనిషి ఉన్నాడు" అనేలాటి ప్రయోగాలను నేడు మనం ప్రయోగిస్తాం. "నేను భావించినట్టే ఆ వ్యక్తికూడ భావిస్తాడని" మన భావం. ఒక విషయాన్ని గూర్చి బలంగా మనం ఏం భావిస్తామో మన మనస్సుల్లో అది తప్పక ఉంటుంది.

దావీదు జీవితాన్ని మనం పరిశీలిస్తుండగా, అతని మంచి దినాలను, చెడ్డ దినాలను కూడా మనం చదువుతాం; అతని ఔన్నత్యాన్ని, పతనాన్ని కూడా చూస్తాం. అతని అతి శ్రేష్ఠతలో గాని, మిక్కిలి హీనతలో గాని అతని భక్తి విశ్వాసము ఎల్లవేళలా దేవునియందే ఉంది. జీవితంలో తుఫానులవలన దావీదు ఆత్మ దిక్సూచి తరచుగా అల్లాడినా, ఆ ఆపద దాటిపోయిన తరువాత, – తన దేవుని వైపునకే ఆత్మసంబంధమైన ధృవమువైపునకే అతని దిక్సూచి చూపుతూ వచ్చింది.

"దేవుని హృదయానుసారులమైన" స్త్రీ, పురుషులుగా మనమెలా కాగలుగుతాం? ముప్పై లేక నలభై ఏళ్ళ ప్రాయంలో, దేవుని హృదయానుసారుడుగా ఒక ఉదయాన దావీదు మేల్కొన్నాడా? లేదు, "దేవుని హృదయానుసారుడైన మనుష్యుడై" ఉండడానికి మొదట అతడు దేవుని హృదయానుసారుడైన బాలుడైయున్నాడు. రాజు కాకమునుపే దావీదు తన హృదయాన్ని మళ్లించాడు.

"యెహోవా తన చిత్తానుసారమైన మనస్సుగల ఒకని కనుగొన్నాడు. నీకు ఆజ్ఞాపించినదానిని నీవు గైకొనకపోతివి గనుక యెహోవా తన జనులమీద అతనిని అధిపతిగా నియమించును" అని సౌలు తన పరిపాలనను ప్రారంభించిన కొద్ది కాలానికే సమూయేలు తెలిపాడు (1 సమూ. 13:14), దావీదు అప్పటికి జన్మించకపోయి ఉండవచ్చు, లేక జన్మించినా, అప్పటికి అతడు పసిబాలుడై యుండవచ్చు.[1] చాలా సంవత్సరాల తరువాత, సౌలు రాజుగా రెండవమారు నిరాకరించబడినప్పుడు, సమూయేలు యిలా అన్నాడు, "నేడు యెహోవా ఇశ్రాయేలీయుల రాజ్యమును నీ చేతిలోనుండి లాగివేసి నీకంటె ఉత్తముడైన నీ పొరుగువానికి దానిని అప్పగించి యున్నాడు" (1 సమూ. 15:28). "నీ పొరుగువాడు" అనేది దావీదును సూచిస్తోంది,[2]

దావీదు అప్పటికి పెద్దవాడు కాలేదు. అతడు తన తండ్రి మందను మేపుతూ బాలుడైయున్నాడు. ఏదియెలాగున్నా, దేవుని వాక్యంలో గుర్తింపదగిన వ్యక్తిగా రూపొందడానికి తగిన గుణగణాలను అతడు వృద్ధిచేసికొనడానికి ఆరంభించాడు.

దావీదు మీద మన శీర్షికను ప్రారంభిస్తూ, "దేవుని హృదయానుసారుడుగా" అతడు ఎలా రూపు దిద్దబడ్డాడో మనం చూద్దాం.

## నడక నేర్చుకున్న కుమారుడు

దావీదు యూదా గోత్రంనుండి వచ్చాడు. యాకోబు పితరుల ఆశీర్వాదంలో[3] రాజ గోత్రంగా యూదా గోత్రం నిర్ణయింపబడింది. ఏదియెలాగున్నా, అతని ప్రత్యేకతను తెలపడానికి ఆ గోత్రం ఏమీ చేయలేదు.

దావీదు పూర్వ చరిత్రలో ఎక్కువ భాగం రమ్యమైన చిన్న రూతు గ్రంథంలో కన్పిస్తుంది. రూతు మోయాబీయురాలు, ఆమె భర్త చనిపోయాడు; తన అత్త నయోమితో ఆమె యూదాకు తరలివస్తుంది. రూతు బోయజుల మధ్య జరిగిన సంగతులను ఆ గ్రంథం తెలుపుతోంది. రూతు బోయజులకు వివాహం జరిగిన తరువాత వారికి ఒక కుమారుడు కలిగాడు. ఆ సందర్భంగా, స్త్రీలు ఆమె చుట్టు పోగయ్యారు నయోమి తన శిశువును ఒడికి చేర్చుకుంది. పొరుగు స్త్రీలు – "నయోమి కొరకు ఆ కుమారుడు పుట్టెనని చెప్పి అతనికి ఓబేదను పేరు పెట్టిరి. అతడు దావీదునకు తండ్రియైన యెష్షయి యొక్క తండ్రి" (రూతు 4:17). ఆ తదుపరి అయిదు వచనాలలో[4] దావీదు యొక్క మిగతా వంశావళి యివ్వబడింది. అది పది తరాలు ముందున్న యూదా కుమారుడైన పెరెసుకు చెందుతుంది.[5]

రూతు బోయజులు బేత్లెహేములో[6] జీవించారు. ప్రస్తుతపు యెరూషలేమునుండి నైఋతి దిశలో అయిదు లేక ఆరు మైళ్ల దూరంలో ఉండే ఒక కుగ్రామమది. ఇక్కడే వారి కుమారుడైన ఓబేదును వారి మనుమడైన యెష్షయియు జీవించారు – ఇక్కడనే వారి ముదిమనుమడునైన దావీదు జన్మించాడు.[7]

ఎనిమిది మంది మగవారు, యిద్దరు కుమార్తెలుగల[8] పదిమంది పిల్లలలో దావీదు కనిష్టుడు. కనిష్టుడు తరచుగా ఇష్టుడైయుంటాడు, అయితే దావీదు పరిస్థితి అట్టిదికాదు. అతనికి "దావీదు"[9] అని పేరు పెట్టారు. "ఇష్టుడు" అని దానికి అర్థం, అయితే మొట్టమొదట అది తప్పుగా వాడినట్టుగా కనిపిస్తుంది. పసివాడుగా కుటుంబంలో యితరులచేత అతడు అంతగా అభినందించబడలేదు.[10] కొందరిచేతనైతే[11] అతడు తృణీకరింపబడినట్టుగా కన్పిస్తుంది.

అతని కుటుంబం పేదది.[12] బోయజు అనేకమంది సేవకులు కలిగి ధనవంతుడుగానే ఉండేవాడు, కాని యెష్షయి వచ్చేసరికి కుటుంబం కష్టకాలంలో పడింది. "అధముడు చిహ్నపు స్తంభంపై నిలిచియున్నట్టు," కష్టమైన, తృణీకరింపబడిన, సాధారణంగా దాసులు చేసే పనులవంటివి అతనికి అంటగట్టబడ్డాయి.[13]

దావీదు ఏ ప్రాముఖ్యమూ లేని గ్రామంలో ఒక బీద కుటుంబాన జన్మించిన అతి

సామాన్యుడు. ఎవ్వరి ప్రేమనూ పొందక, సోదరుల అపహాస్యానికి గురౌతూ, ఇతరులెవ్వరూ చేయడానికిష్టపడని పనులను చేస్తూ ఉండేవాడు. అతనికి దుఃఖం కలగడం ఎంత సహజం! తిరుగుబాటు తనం చూపడానికి, దేవుణ్ణి, కుటుంబాన్ని, సమాజాన్ని అవిధేయంగా తూలనాడడం ఎంత సహజం! కాని దావీదు ఇలాంటి ప్రతిక్రియ చూపలేదు. పైగా బాలుడుగానే అతడు రోజూ దేవుని అనుసరించి నడచాడు.

అతని జీవితంలో ఆరంభ కాలమందే అతనిని దేవునికి సమర్పించుకునేలా ప్రభావితం చేసిన పరిస్థితులన్నీ మనకు తెలియవు. యూదుల పిల్లలు ధర్మశాస్త్రమందు శిక్షితులవ్వడం అలవాటు. అందులో, దావీదు కుటుంబం కలిసి కూడినప్పుడు, ఇశ్రాయేలు జనాంగంతో దేవుడు ఆశ్చర్య కార్యాలను ఎలా జరిగించాడో, వాగ్దాన దేశానికి వారిని ఎలా తోడుకొని వచ్చాడో అనే సంగతులను అతడు వినియుండవచ్చు. తమ కుటుంబాన్నే, అంటే, రూతు బోయజులను, ఓబేదును, ఇప్పుడు యెష్షయి అతని పిల్లలను దేవుడు ఎలా ఆశీర్వదించాడో అతడు వినియుండవచ్చు. దావీదు ఆలకించుతూ ఉండగా, దేవుని వాక్యమనే బీజం స్వీకరింపని నేలపై[14] పడలేదు. అయితే, బలమైన స్థిరమైన కదలని దేవుని[15] యందలి విశ్వాసంగా అది ఎదిగి ఫలించింది.

ప్రతి తల్లిదండ్రి యిక్కడ పాఠాలను చూడవచ్చు. మన బిడ్డలకు లోతైన, బలమైన ఆత్మసంబంధమైన వాటిని యిద్దాం. దేవుని పరిశుద్ధ గ్రంథమందు ప్రేమను, దానియందలి జ్ఞానాన్ని పిల్లల మనస్సుల్లో నాటించడానికి యిది చాల చిన్నతనం అనేది ఎన్నడూ ఉండదు.[16]

వ్యక్తులుగా మనలో ప్రతి ఒక్కరికి యితర పాఠాలు కూడా ఉన్నాయి. మనలో ప్రతి ఒక్కరం మన దేవునికి జవాబు చెప్పవలసినవారమై ఉన్నాం. దేవునికి లోబడకపోవడానికి యితరులనుగాని పరిస్థితులనుగాని మనం నిందించకూడదు. యౌవనులో, వృద్ధులో, దేవుడైన యెహోవాకు వ్యక్తిగతమైన సమర్పణ సాధ్యమైనంత త్వరలో చేపట్టనవసరం ఉంది. ఆయనతో నడువ నేర్చుకొనడానికి సమయం పడుతుంది.

## పని నేర్చుకున్న గొర్రెల కాపరి

దావీదు ఆరంభ జీవితాన్ని గూర్చి మనకు తెలిసిన ఒక వాస్తవం ఏమంటే – అతడు గొర్రెలను భద్రంగా కాచాడు. మరియొక కుమారుడు తనకున్నాడా అని సమూయేలు యెష్షయిని అడిగినప్పుడు, "–ఇంకను కడసారివాడున్నాడు. అయితే వాడు గొఱ్ఱెలను కాయుచున్నాడని" అతడు తెలిపాడు (1 సమూ. 16:11). "దావీదు బేత్లెహేములో తన తండ్రి గొఱ్ఱెలను మేపుచు సౌలునొద్దకు తిరిగి పోవుచు వచ్చుచు నుండెను" అని మనం చదువుతాం (1 సమూ. 17:15). సైన్యములో ఉన్న తన ముగ్గురు అన్నలకు దావీదు ఆహార సామగ్రిని కొనిపోయినప్పుడు, వారిలో ఒకడు "అరణ్యములోని ఆ చిన్న గొఱ్ఱెమందను ఎవరి వశము చేసితివి?" అని వ్యంగ్యంగా మాట్లాడాడు (1 సమూ. 17:28).[17]

గొర్రెల కాపరియైన బాలుడుగా బైబిల్లో దావీదు జీవితాన్ని గూర్చిన ఏ కథయులేదు.

దావీదు కీర్తనలనుండియు, బైబిలు యితర లేఖన భాగాలనుండియు, ఆ వృత్తిని గూర్చిన యితర మూలాలనుండియు మనం ఎరిగిన వాస్తవాలనుండియు మనం అలాటి కథను కల్పించవచ్చు.

గొర్రెలు కాయడం గౌరవపదమైన వృత్తియేగాని, అది సామాన్యమైనది.

గొర్రెలు కాయడం ఒంటరి బ్రతుకు, గొర్రెలే తప్ప యితర సహవాసిలేని దీనస్థితి.[18]

గొర్రెలు కాయడం బాధ్యతతో కూడిన జీవితం. కాపరి తన గొర్రెలను గురించి తెలుసుకోవాలి సరిగదా, వాటిని ఎలా కాయాలో కూడా ఎరిగి ఉండాలి. పచ్చిక బయళ్లు, నీటిచెలమలును, పాలస్తీనా మార్గాలు అతడు బాగుగా ఎరిగి ఉండాలి. తప్పిపోయిన వాటిని వెదకాలి. జబ్బుపడిన, గాయపడినవాటి విషయంలో దయకలిగి ఉండాలి. ఆడ గొర్రెలు పిల్లలను ఈనే విషయంలోను, క్రొత్త గొర్రెపిల్లలను సంరక్షించడంలోనూ తాను శ్రద్ధవహించువాడై ఉండాలి (కీర్తన. 23; యోహాను 10:1-18; లూకా 15:4-6; కీర్తన. 78:71).

గొర్రెలు కాయడం కష్ట జీవనం. దావీదు తన గొర్రెలను కాయుటను గూర్చి మనం ఆలోచన చేసేటప్పుడు, చల్లగా ఉన్న నీలి మేఘం క్రింద రమ్యమైన పచ్చికబయలును మనం కాంచగలిగినట్లయితే, అక్కడనుండి మన దృష్టిని, రాతిమయమైన యూదా కొండ చరియలో ఎండవేడిమి క్రింద, అరణ్యపు దుమ్మును రేపుతూ కొట్టే తూర్పు వడగాలివైపుకు, మరల్చి చూడు. పాలస్తీనాలో గొర్రెలు కాయడం వేడి, దుమ్ము, వాసనకొడుతూ సహించరానిదై ఉంటుంది.

కొన్ని సార్లు, గొర్రెలు కాయడం అపాయకరమైన పని. అపాయకరమైన కొండ సందులలోగుండా, అంటే, "మరణచ్ఛాయగల లోయలోగుండా" (కీర్తన. 23:4) అతడు వాటిని నడిపించవలసివస్తుంది. వాటిని దొంగిలించడానికి ప్రయత్నించే ఫిలిష్తీయులనుండి వాటిని కాపాడవలసి వస్తుంది (యోహాను 10:1). దుష్ట మృగములనుండియు, అపాయకరమైన పక్షులనుండియు చిన్న, నిస్సహాయమైన గొర్రెపిల్లలను అతడు కాపాడవలసి ఉంటాడు. వాటిని చంపి తినడానికి వచ్చిన అడవి జంతువులను గూర్చి దావీదు రాజైన సౌలుకు యిలా వివరించాడు:

> మీ దాసుడనైన నేను నా తండ్రియొక్క గొఱ్ఱెలను కాయుచుండగ సింహమును ఎలుగుబంటియును వచ్చి మందలోనుండి ఒక గొఱ్ఱెపిల్లను ఎత్తుకొని పోవుచుండగా, నేను దానిని తరిమి చంపి దాని నోటనుండి ఆ గొఱ్ఱెను విడిపించితిని; అది నా మీదికి రాగా దాని గడ్డము పట్టుకొని దానిని కొట్టి చంపితిని. మీ దాసుడనైన నేను సింహమును ఎలుగుబంటిని చంపితినే.... (1 సమూ. 17:34-36).

ఒక యువకుడు ఒక సింహమునో లేక ఎలుగుబంటినో కండ్లలో కండ్లుపెట్టి చూస్తున్నట్టు ఊహించు! నేనేమి చేసేవాడనో నాకే తెలియదు. నేనొక చోట ఎక్కువ సమయం నిలిచిపోయాను, నేను చెట్టు ఎక్కలేను! అయితే దావీదు యువకుడుగా ఉండగానే ఈ క్రూర జంతువులను ఎదుర్కొని వాటిని చంపాడు. అతనికున్న ఆయుధాలేమిటి? అతని దుడ్డుకర్ర, వడిసెల (కీర్తన. 23:4; 1 సమూ. 17:40) - దేవునియందలి

విశ్వాసము, "సింహముయొక్క బలమునుండియు, ఎలుగు బంటియొక్క బలమునుండియు" తనను రక్షించినది తన దేవుడైన యెహోవాయేనని అతడు తెలిపాడు (1 సమూ. 17:37).

తన జనులను నడిపించగలవాని కొరకు దేవుడు చూచినప్పుడు, సేవ చేయించు కుంటూ విలాసాలతో తులతూగుతున్నవాడి కోసం చూడలేదు. ఎలా పని చేయాలో ఎరిగినవానికొరకు, బాధ్యత అంటే ఏమో ఎరిగినవాని కొరకు, కష్టాన్ని సహించగలవాని కొరకు, దాని పర్యవసానమేమైయున్నా, తన పనిని చేసేవాని కొరకు ఆయన చూస్తున్నాడు. బేత్లెహేమునకు వెలుపల ఏకాంతపు బయలులలో దావీదు ఈ పాఠాలను నేర్చుకున్నాడు.

> తన దాసుడైన దావీదును కోరుకొని
> గొఱ్ఱెల దొడ్లలోనుండి అతని పిలిపించెను.
> పాడి గొఱ్ఱెలను వెంబడించుట మాన్పించి
> తన ప్రజలైన యాకోబును,
> తన స్వాస్థ్యమైన ఇశ్రాయేలును మేపుటకై ఆయన అతనిని రప్పించెను.
> అతడు యథార్థహృదయుడై వారిని పాలించెను.
> కార్యములయందు నేర్పరియై వారిని నడిపించెను
> (కీర్తన. 78:70-72).

మన దినాల్లో ఉండే గొప్ప అవసరాలలో బాధ్యతతోకూడిన భావన ఒకటి. మనం పనిచేసే స్థలములలో మనం బాధ్యతారహితంగా ఉంటాం. మన యిరుగు పొరుగు బాధ్యతలు లేకుండా ఉంటాం. వివాహాల్లో బాధ్యతారహితంగా ఉంటాం. కుటుంబాలలో బాధ్యతా రహితంగా ఉంటాం. సంఘంలో సహితం బాధ్యతారహితంగా ఉంటాం. రాజకీయాలలో బాధ్యతారహితంగా ఉంటే, అది వేరే.

మనలో ప్రతి ఒక్కరం వ్యక్తిగతంగా వర్తింపజేసికొందాం. మనము బాధ్యతారహితమైన వ్యక్తులమైయుంటే, మన అలక్ష్యం విషయంలో మారుమనస్సుపొంది, మన మార్గాలను మార్చుకుందాం! ఎలా పని చేయాలో ఎరిగి బాధ్యతను అంగీకరించే జనులను మాత్రమే దేవుడు ఉపయోగించుకొనగలడు.

మనం తల్లిదండ్రులమై ఉన్నట్టయితే, మన బిడ్డలు బాధ్యతగల స్త్రీ పురుషులుగా మారేలా నేర్పుదాం![19] వారికి మనం బాధ్యతను అప్పగించుదాం! అప్పగింపబడిన పనులకు వారిని బాధ్యులుగా ఉండునట్టు నిలుపుదాం! ప్రభువుకు వారు ఉపయోగపడునట్లుగా వారిని సిద్ధపరచుదాం!

## వేచి ఉండడానికి నేర్చుకున్న రాజు

చివరిగా 1 సమూ. 16ను చూడడానికి మనం సిద్ధపడ్డాం. ఇప్పటివరకు, దావీదు 1 సమూయేలులో ప్రస్తావించబడలేదు. దృష్టియావత్తు రాజైన సౌలుపై కేంద్రీకరించబడింది. ఏదియెలాగున్నా, సౌలు పరిపాలన చిక్కాకైపోయింది. దేవుని మీద ఆధారపడడానికి బదులు, తన సొంత బలముమీదను జ్ఞానంమీదను ఆధారపడ్డాడు. తన పరిపాలన ఆరంభ దశలో, దేవుడు ఆజ్ఞాపించినట్టు సమూయేలు కొరకు వేచియుండడానికి బదులు, తన సేనలను పోగొట్టుకుంటానేమోననే భయంతో అతడు దహనబలియర్పించాడు (1 సమూ. 13:13).

తరువాత, దేవుడు అతన్ని ఆదేశించినట్టు అమాలేకీయులను సంపూర్తిగా నాశనం కావించకుండ, అతడు రాజును, జంతువులలో శ్రేష్ఠమైనవాటిని ఉండనిచ్చాడు (1 సమూ. 15:2, 3, 9). అప్పుడు దేవుడు సమూయేలుతో యిలా చెప్పాడు, "-సౌలు నన్ను అనుసరింపక వెనుకతీసి నా ఆజ్ఞలను గైకొనకపోయెను గనుక అతనిని రాజుగా నిర్ణయించినందుకు నేను పశ్చాత్తాపపడుచున్నాను" (1 సమూ. 15:11). సౌలును రాజుగా అభిషేకించిన సమూయేలు, హృదయమందు నలిగినవాడైనను, సౌలుకు పరమ దేవుని వర్తమానాన్ని యిలా తెలియజేశాడు: "నేడు యెహోవా ఇశ్రాయేలీయుల రాజ్యమును నీ చేతిలోనుండి లాగివేసి నీకంటె ఉత్తముడైన నీ పొరుగువానికి దానిని అప్పగించి యున్నాడు" (1 సమూ. 15:28). తరువాత రాజును అభిషేకించడం, అటు పిమ్మట జరిగిన సంఘటనలు మొదటి సమూయేలు 16 తెలుపుతోంది.

దుఃఖముఖుడైన సమూయేలును దేవుడు రామాలో[20] సంధిస్తాడు. "-ఇశ్రాయేలీయుల మీద రాజుగా ఉండకుండ నేను విసర్జించిన సౌలును గూర్చి నీవెంతకాలము దుఃఖింతువు? నీ కొమ్మును తైలముతో నింపుము, బేత్లెహేమీయుడైన యెష్షయి యొద్దకు నిన్ను పంపుచున్నాను, అతని కుమారులలో ఒకని నేను రాజుగా నియమించుదును" (1 సమూ. 16:1) అని దేవుడైన యెహోవా సమూయేలుతో అంటాడు. సైన్యములోనికి వెళ్లి ఒక సైనికుని తెమ్మని ఆయన సమూయేలుకు తెలుపలేదు. ప్రవక్తల పాఠశాలకు వెళ్లి ఒక పండితుని తీసికొని రమ్మని అతనికి ఆయన తెలుపలేదు. పెద్ద పట్టణాలలో ఒకదానిలోనికి వెళ్లి పురపాలక నాయకుని తోడుకొని రమ్మని అతనికి ఆయన ఆజ్ఞ ఇయ్యలేదు. రాజ మార్గమునకు ప్రక్కన నిలిచిన ఒక గ్రామానికి ఆ ప్రాంతంలోని ఒక పేద కర్షకుని యింటికి[21] వెళ్లవలసిందిగా ఆయన అతనికి సెలవిచ్చాడు. దేవుని త్రోవలు మన త్రోవలవంటివి కావు (యెషయా 55:8, 9).

ఏదియెలాగున్నా, సమూయేలు మాత్రం సౌలుకు భయపడ్డాడు.[22] "నేనెట్లు వెళ్లుదును? నేను వెళ్లిన సంగతి సౌలు వినినయెడల అతడు నన్ను చంపునని" సమూయేలు దేవునికి మనవి చేసికొన్నాడు (1 సమూ. 16:2ఎ). అతనికి మారుగా వేరొకడు నియమింపబడతాడనే విషయం అతనికి తెలిసేసరికి, తన సింహాసనపు హక్కును సవాలు చేయగలవాడెవడో వానికొరకు సౌలు కనిపెడుతూ ఉన్నాడు. "-నీవు ఒక పెయ్యను తీసికొనిపోయి యెహోవాకు బలిపశువును వధించుటకై వచ్చితినని" చెప్పుమని దేవుడు సమూయేలుకు సూచించాడు (1 సమూ. 16:2బి). అబద్ధమాడమని దేవుడు సమూయేలుకు చెప్పాడా? లేదు. సమూయేలు పెయ్యని తీసికొని బలియర్పించాడు (16:4, 5). ఇలాటి కొన్ని సందర్భాల్లో మన అసలైన ఉద్దేశాన్ని మరుగ్గా ఉంచి, రెండవ ఉద్దేశం బయలుపరచబడడం జరిగింది. ఈ సందర్భంలో మాత్రం అంతర్గత కలహాన్ని నిరోధించడానికి, మర్మం అవసరం. -యిది సమూయేలు, దేవునిచే ఏర్పరచబడినవానిని కాపాడడానికి ఉద్దేశింపబడింది.

దేవుడు తన ఆదేశాలను కొనసాగించాడు: "యెష్షయిని బల్యర్పణమునకు పిలువుము; అప్పుడు నీవు చేయవలసిన దానిని నీకు తెలియజేతును; ఎవని పేరు నేను నీకు చెప్పుదునో అతనిని నీవు అభిషేకింపవలెను" (16:3)

కొమ్మును తైలముతో నింపుకొని, పెయ్యను వెంటబెట్టుకొని సమూయేలు దక్షిణమున ఉన్న బేత్లెహేమునకు బయలుదేరాడు. అతడు ఆ గ్రామమునకు చేరుకున్నప్పుడు, ఆ ఊరి పెద్దలు "అతని రాకకు భయపడ్డారు" (16:4ఎ). సమూయేలు యింకను న్యాయాధిపతిగా పని చేస్తున్నాడు.[23] బేత్లెహేము అతని పరిధిలో లేదు,[24] ప్రసిద్ధుడైన న్యాయాధిపతి అల్ప గ్రామాన్ని సందర్శించడంలో, ఆ గ్రామాధికారులకు వచ్చిన మొదటి ఆలోచన ఏమంటే, బేత్లెహేము పెద్ద తప్పు చేసి ఉంటుందని. ఒకవేళ గ్రామమంతయు శిక్షింపబడ వచ్చునేమో భయపడుతూ, ఆ గ్రామ పెద్దలు, "–సమాధానముగా వచ్చుచున్నావా?" (16:4బి) అని అడుగగా, "అతడు–సమాధానముగానే వచ్చితిని; యెహోవాకు బలియర్పించ వచ్చితినని" తెలిపాడు (16:5ఎ).

తమను తాము శుద్ధిచేసికొని[25] బలియర్పణమునకు రండని సమూయేలు వారికి తెలిపాడు (16:5బి). బలిని అర్పించినప్పుడు, సాధారణంగా ప్రత్యేకమైన భాగాలు మాత్రమే అర్పించబడతాయి, మిగిలిన భాగాలను తింటారు.[26] బేత్లెహేములో విందు జరుగుతుంది, ఇశ్రాయేలులో అందరికి ఎరుకైన వానివలన అది చేయబడుతుంది, ప్రాముఖ్యమైన వారు దానికి ఆహ్వానించబడ్డారు. నిద్రావస్థలోనున్న ఆ చిన్న గ్రామానికి అది ఉత్సాహాన్ని కలిగించియుండవచ్చు.

యెష్షయిని అతని కుమారులను సహితం దానికి ఆహ్వానించుమని సమూయేలు వారికి ఆదేశించాడు (16:5సి).[27] యెష్షయి ఎంత సంతోషంతోను ఆశ్చర్యంతోను ఆ ఆహ్వానాన్ని స్వీకరించి ఉంటాడో ఊహించు! తన తాతయైన బోయజు ఆ సమాజంలో బహుగా గౌరవింపబడినవాడై ఉండేవాడు. అతని కొరకు సంగతులు ఎదురు చూడబడు తున్నాయేమో. యెష్షయియు (అతని కుమారులలో దాదాపుగా అందరు) మంచిగా స్నానం చేసి తమకు ఉన్న "శ్రేష్ఠమైన దుస్తులు" ధరించినవారై ఆ ఉత్సవానికి వెళ్లారు.

విందు సిద్ధపరచబడిన చోటునకు వారు నడుస్తూ ఉండగా, సమూయేలు యెష్షయి జ్యేష్ఠకుమారుడైన ఏలీయాబును చూసాడు.[28] అతడు ఎత్తయినవాడు, రూపసి,[29] రాజులా కన్పిస్తాడు. "–నిజముగా యెహోవా అభిషేకించువాడు ఆయన యెదుట నిలిచి యున్నాడని" సమూయేలు తలంచుతున్నాడు (16:6).

1 సమూయేలులో అతి ముఖ్యమైన వచనం దగ్గరకు మనం వచ్చాం: "అయితే యెహోవా సమూయేలుతో ఈలాగు సెలవిచ్చెను – అతని రూపమును అతని ఎత్తును లక్ష్యపెట్టకుము, మనుష్యులు లక్ష్యపెట్టువాటిని యెహోవా లక్ష్యపెట్టడు; నేను అతని త్రోసివేసియున్నాను. మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురు గాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (16:7). "పైరూపము" అనేది "కన్నులు" అనే అర్థమిచ్చునట్టి హెబ్రీ పదంనుండి తర్జుమా చేయబడింది, పర్యాయంగా అది ముఖాన్ని సూచిస్తోంది.

అది అప్పుడూ నిజమే యిప్పుడూ నిజమే, మనుష్యులు పైరూపాన్ని చూచి లక్ష్యపెడతారు. మన సువార్తికులు సువార్తికులుగా కన్పించాలని మనం కోరుకుంటాం. మన రాష్ట్రపతులు రాష్ట్రపతులుగా కన్పించాలని కోరుకుంటాం. ఎవరికి వారు వారిలాగే ఉండాలనేది మన దృష్టి. వ్యక్తికంటె, అతనికి ఉన్న పైరూపమే ఎక్కువ ముఖ్యమని మనం తరచుగా భావిస్తాం.

వారు పైకి కన్పించేటట్లుగా వ్యవహరించలేదని మనం తరచు నిరాశను పొందుతాం. అందమైన రూపంగల యువతి తగిన భార్యగా ప్రవర్తించకపోతే ఒక యువకుడెంత బాధపడతాడు! చాలామంది యువతులు, అందమైన యువకులచే మోసపడి భగ్న హృదయులౌతుంటారు.

పైకి కన్పించేదానిని ఆధారం చేసికొని దేవుడు తీర్పులు చేయడు, నిర్ణయాలు చేయడు. దానికి మారుగా ఆయన హృదయాన్ని చూస్తాడు.[30] "అసలైన న్యాయాధిపతి తన న్యాయాధిపతికి ఎలా తీర్పు తీర్చాలో నేర్పుతున్నాడని" ఒక వ్యక్తి అన్నాడు.[31] మనం ఎలా తీర్పు తీర్చాలో దేవుడు మనకు కూడా నేర్పుతాడు. "వెలిచూపునుబట్టి తీర్పుతీర్చక న్యాయమైన తీర్పు తీర్చుడి" అని ప్రభువు అన్నారు (యోహాను 7:24).[32]

అబీనాదాబు అను తన రెండవ కుమారుని యెష్షయి పిలిచాడు, అతడు కూడా ఎత్తయినవాడు అందగాడైన యువకుడే. సమూయేలు తన తలను ఆడించి, "యెహోవా యితని కోరుకోలే"దన్నాడు (16:8). మూడవవాడైన షమ్మా వంతు వచ్చింది, "యెహోవా ఇతని కోరుకోలే"దనే జవాబు వచ్చింది (16:9). నెతనేల్, రాదాయ్, ఓజెమ్[33] ఇలా ఒకరి తరువాత ఒకర్ని తన ఏడుగురు కుమారులను సమూయేలు ఎదుటికి పిలువగా, సమూయేలు – "యెహోవా వీరిని కోరుకొనలేదని" చెప్పాడు (16:10). వారందరు అందమైన యువకులు – రాజుగా ఉండ తగినవారే.

సమూయేలు దిగ్భ్రమచెందాడు. యెష్షయి కుమారులలో రాజును ఎన్నుకున్నానని దేవుడు తెలిపాడు (16:1), యెష్షయి కుమారులందరు విందుకు పిలువబడ్డారు. "నీ కుమారులందరు ఇక్కడనున్నారా?" అని యెష్షయిని సమూయేలు ప్రశ్నించాడు (16:11ఎ). ధర్మసంకటమైన స్థితియందుపడి, "–ఇంకను కడసారివాడున్నాడు. అయితే వాడు గొఱ్ఱెలను కాయుచున్నాడని" యెష్షయి బదులిచ్చాడు (16:11బి). "కడసారివాడు" అనే పదానికి, కనిష్ఠుడని మాత్రమే గాక, హోదాలో తక్కువవాడని కూడా భావమున్నట్టు హెబ్రీ పండితులంటారు.

ఆ విందుకు దావీదు ఎందుకు ఆహ్వానించబడలేదు? గొర్రెలను జాగ్రత్త చేయడానికి వేరొకని కూలికి పెట్టుకొనడం కష్టం కావచ్చు, కాని ఈ ప్రత్యేకమైన సందర్భానికి అలా చేసియుండవచ్చు.[34] కుమారులందరు ఆహ్వానింపబడ్డారు. యెష్షయి దావీదును ఎందుకు తీసికొనిరాలేదు?[35]

ఒకవేళ దావీదు భిన్నంగా ఉండడంవల్ల కావచ్చు. "ఎఱ్ఱనివాడు" అని అతడు పిలువబడ్డాడు (16:12). "ఎఱ్ఱని" అనే అర్థమిచ్చే హెబ్రీ పదంనుండి అది వచ్చింది. ఎఱ్ఱని వెంట్రుకలతో కప్పబడిన ఏశావునకు ఉపయోగింపబడిన పదమే (ఆది. 25:25) యిక్కడ కూడా ఉపయోగింపబడింది. దావీదు రూపంలో తన పూర్వికులకంటే[36] అన్యమైన జన్యు కణాలు వచ్చి ఉండవచ్చు. "ఎఱ్ఱని" అనేది దావీదు ఎరుపు శరీర ఛాయగలవాడని కావచ్చు – లేదా ఎఱ్ఱని మచ్చలు కలిగిన ముఖం కలవాడని కావచ్చు. ఎటు చూచినా, యూదుని లక్షణాలకు అతడు సరిపోడని చెప్పవచ్చు.

దావీదు భిన్నంగా కన్పించడం మాత్రమే గాక; అతడు భిన్నంగాను వ్యవహరించాడు. నిజమైన మనిషిలా అతడు వ్యవహరించలేదు. అతడు పద్యాలు రాసేవాడు, సితారా వాయించేవాడు![37] అది సంపూర్ణంగా భిన్నం.

నేను దావీదును గూర్చి ఆలోచించేటప్పుడు, “the runt of the litter” అనే నుడికారం గుర్తొస్తుంటుంది. ఒక తల్లి కుక్కకు ఒకసారి పాలివ్వగలిగినంతకంటె ఎక్కువ సంఖ్యలో కుక్క పిల్లలుంటే అన్నింటికంటె చిన్న పిల్లను మిగతావి పక్కకు తోసేస్తాయి. పెద్దవన్నీ తాగి వాటి కడుపు నిండాక, మిగిలిన పాలమీదే చిన్న కుక్కపిల్ల ఆధారపడి బతుకుతుంది. తరచుగా ఆ చిన్న కుక్క పిల్ల ఎంతో ముద్దుగా, గట్టిదిగా ఉంటుంది. కాని దానిమీద “చిన్నది” (the runt) అనే మచ్చ ఉండనే ఉంటుంది.

దావీదు అన్నవస్త్రాలకు లోటు లేకుండా పెరిగాడనడానికి సందేహం లేదు. కాని అతని కుటుంబంలో దొరకవలసిన ప్రేమ, గౌరవం, ఆప్యాయతల విషయంలో అతణ్ణి ఒక ప్రక్కకు తోసేసారు. తరువాత దావీదు ఇలా రాసాడు: “నా తల్లిదండ్రులు నన్ను విడిచినను యెహోవా నన్ను చేరదీయును” (కీర్తన. 27:10). కొంతగాకపోతే కొంతైనా తన కుటుంబంవల్ల అలక్ష్యం కలుగకపోతే దావీదలా ఎందుకు రాస్తాడు?[38] మన పిల్లలందరిని తల్లిదండ్రులమైన మనం వాళ్లను ప్రేమించి అభిమానిస్తున్నామని తెలుసుకోడానికి, ఒక్కరిని ప్రత్యేకించి అభిమానంగా చూడకుండా ఉండడానికి దేవుడు మనకు సహాయపడును గాక!

దావీదును యెష్షయి ఎందుకని విందుకు తీసికొనిరాలేదో నిజమైన కారణం మనకు తెలియదు,[39] అయితే ఒకటి మాత్రం స్పష్టంగా కన్పిస్తుంది, ఏమంటే – తన పెద్ద బిడ్డలను గూర్చి ఆలోచించినంతగా, తన చిన్న కుమారుని గూర్చి యెష్షయి ఆలోచించినవాడు కాడు. దావీదు వెనుక పచ్చికబయలులో విడిచిపెట్టబడ్డాడు.

సమూయేలు ఒక అసంతుష్టుడైన న్యాయాధిపతి! “–నీవు వాని పిలువనంపించుము, అతడిక్కడికి వచ్చువరకు మనము కూర్చుందమని” సమూయేలు యెష్షయికి ఆజ్ఞాపించాడు (16:11సి).

వర్తమానికుడు పరుగెత్తికొని తన వద్దకు వచ్చినప్పుడు దావీదు ఆశ్చర్యం ఎలా ఉంటుందో ఊహించు. “దావీదూ, దావీదూ నీవు విందుకు త్వరగా రావాలి” అని అంటూ ఊపిరి తిరగని వర్తమానికుని మాటలను తలంచు!

దావీదు తన చెవులను నమ్మలేకపోయాడు. “అయితే గొర్రెల సంగతి ఏమిటి?”

“గొర్రెలను గూర్చి ఆందోళన చెందకులే. అవి బాగానే ఉంటాయి.”[40]

“సరే, నన్ను స్నానంచేసి బట్టలు మార్చుకోనియ్యి, నేను నీతో వస్తాను.”

“లేదు, నీవు యిప్పుడే రావాలి. నువ్వక్కడికొచ్చేవరకూ ఎవ్వరికీ అక్కడ కూచుని తినడానికి అనుమతిలేదు!”

దావీదు విందు వద్దకు, చెమట పట్టి, దుమ్ముకొట్టుకొని, గొర్రెల కాపరి వేషంలో, గొర్రెలలా వాసనకొట్టుకొంటూ విందుకు వచ్చాడు, అయినా అతనిలో ఏదో ప్రత్యేకత ఉంది. “అతడు ఎర్రనివాడును చక్కని నేత్రములు గలవాడును చూచుటకు సుందరమైన వాడునై యుండెను” (16:12ఎ). అయినా, అతన్ని దేవుడు ఎన్నుకునేలా చేసింది అతని అందం కాదు. అది అతని హృదయం; తన హృదయానుసారుని దేవుడు కనుగొన్నాడు. “నేను కోరుకున్నవాడు ఇతడే, నీవు లేచి వానిని అభిషేకించుమని” యెహోవా సెలవిచ్చాడు (16:12బి).

తన యెదుట మోకరించుమని సమూయేలు దావీదుతో అన్నాడు. దావీదు తలమీదికి కొమ్మును లేపి తన గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచువరకు దిగజారునట్టు పరిమళ తైలాన్ని సమూయేలు అతని తలపైన పోశాడు. అప్పుడు సమూయేలు వంగి, దావీదు చెవిలో, "నీవు తరువాత రాజువు కానున్నావు" అని చెప్పినట్టు జోసీఫస్ అన్నాడు.[41] అది అలా జరిగిందో లేదో కాని, ఏదో ఒక ప్రత్యేకమైన సంగతి జరిగినట్టు మాత్రం దావీదుకు తెలుసు.[42]

"నాటనుండి యెహోవా ఆత్మ దావీదుమీదికి బలముగా వచ్చెను" (16:13సి). పరిశుద్ధాత్మను గూర్చిన బోధ పాత నిబంధనలో పెంపు చేయబడలేదు గనుక, దేవత్వంలోని మూడవ వ్యక్తిని ఈ సందర్భం సూచింపకపోవచ్చు, అప్పటినుండి దేవుడు దావీదుతో ప్రత్యేకంగా ఉంటాడు.[43] దీనివలన కలిగిన ఒక ఫలితం కీర్తనలను రాసేటప్పుడు దావీదుకు దేవుని నడిపింపు ఉంది (2 సమూ. 23:1, 2).

"సమూయేలు తన సహోదరుల యెదుట అతని అభిషేకించెను" అని 13వ వచనం గుర్తిస్తుంది. అక్కడ జరిగిన సంఘటనలోని పూర్తి ప్రాముఖ్యతను అతని సహోదరులు ఎరుగక పోయి ఉండవచ్చు. (అంతకుముందు ఒకడు రాజుగా అభిషేకింపబడినా, అది కూడా బహిరంగముకాని కార్యక్రమమే.[44]) ఏదియెలాగున్నా, కొంత గౌరవానికి చిన్నవాడు "వేరుచేయబడి" ఏర్పరచబడ్డాడన్న విషయాన్ని వారు గ్రహింపకపోలేదు.[45]

అతని పని ముగిసిపోయింది, సమూయేలు గృహానికి చేరుకున్నాడు (16:13).

దావీదు ఏమి చేశాడు? అతడు తన గొర్రెల వద్దకు తిరిగి వెళ్లాడు. అతడు రాజు కిరీటాన్నో లేక నడికట్టునో ధరించనారంభించాడా? తన పరిచయపు కార్డ్‌లో "కాపరి" అనే పదాన్ని తీసివేసి "రాజు" అని వేసికొన్నాడా? అతడు కుటుంబ రథాన్ని శుభ్రం చేసి "నేను మీ రాజును"[46] అని వీధుల్లో గుండ గంతులు వేస్తూ వెళ్లాడు. తరువాత సౌలు యెష్షయి వద్దకు వర్తమానం పంపి, "గొఱ్ఱెల యొద్దనున్న నీ కుమారుడైన దావీదును నాయొద్దకు పంపుమనెను" (16:19). సౌలు కొరకు వాయిద్యము వాయించినప్పటికిని, "దావీదు బేత్లెహేములో తన తండ్రి గొఱ్ఱెలను మేపుచు సౌలునొద్దకు తిరిగి పోవుచు వచ్చుచు నుండెను" (1 సమూ. 17:15).[47]

రాజుగా దావీదు అభిషేకింపబడ్డాడు; అతడు ఏర్పరచబడిన రాజు, అయితే అతడు దేవుని హృదయానుసారుడైన మనుష్యుడు. దేవుని సమయము, దేవుని స్థలం కొరకు అతడు వేచియుండగలడు. అతడు తన గొర్రెల వద్దకు తిరిగి వెళ్లాడు.

దేవుని మీద ఆనుకొనుటకును, ఓర్పు కలిగియుండుటకును మనం నేర్చుకోవాలి. నేర్చుకొనవలసిన యిది ఎంతటి ముఖ్యమైన పాఠము; నేర్చుకొనడానికి అది ఎంత కష్టమైన పాఠం! దేవుని ఉపయోగానికి మనం సిద్ధంగా ఉందాం – వేచియుండడానికి మనం నేర్చుకుందాం.

## ఆరాధించుటకు నేర్చుకున్న పాటగాడు

రాజుగా ఎన్నుకోబడ్డ గొర్రెల కాపరి పచ్చిక బయలునుండి సింహాసనానికి వెళ్లక

ముందు జరిగిన మార్పు ఏమి? సాధారణంగా, గొర్రెలు కాయువాడు రాజనగరు లోపలి భాగాన్ని చూడ నోచుకోడు, కాని దేవుడు వింతైన మార్గాల్లో తన కార్యాలను జరుపుతాడు. దేవుడు దాన్ని ఎలా మేనేజ్ చేశాడో 16వ అధ్యాయపు చివరి భాగం మనకు తెలుపుతోంది.

గొర్రెలు కాచే బాలుడుగా, మనం క్లుప్తంగా ప్రస్తావించిన తలాంతులను దావీదు పెంపొందించుకొన్నాడు: తన గొర్రెలను కాయుచునే, పాడి, వాయిద్యాన్ని వాయించే నేర్పును అతడు పొందాడు.

గొర్రెలను కాయడంలో ఎన్నో గంటలు నిరుత్సాహ భరితమైన విసుగుచెందే పరిస్థితు లుంటాయి. పచ్చికబయళ్ళలో గొర్రెలు క్షేమంగా మేస్తున్నాయంటే, వాటిని చూస్తూ ఊరకే కూర్చోడం తప్ప ఎక్కువ పని ఉండదు. వాయిద్యాలు వాయించుకొంటూ ఉల్లాసంగా ఉండడం కాపరులకు వింతైన సంగతి ఏమీ కాదు. ఎక్కువమంది పిల్లన గ్రోవిని ఎన్నుకుంటారు. దావీదైతే తంతి వాయిద్యాన్ని కోరుకున్నాడు. NASB మరియు యితర తర్జుమాలు "సితారా" (16:23), అయితే శ్రేష్ఠమైన తర్జుమా "వీణె"[48] తక్కువ తంతులుగల చిన్న వాయిద్యము (ప్రాచీన కాలపు రూపంలోనిది).

రాళ్లమయమైన కొండ ప్రాంతంలో ఒంటరిగా ఉన్న దినాలలో దావీదు పద్యాలను వ్రాస్తూ వాటికి సంగీతాన్ని కూర్చేవాడు. అప్పుడు అతడు పాడుతూ వాయిద్యం వాయించేవాడు. అందమైన స్వరంతోను, వాయిద్య నైపుణ్యంతోను దేవుడు అతని దీవించాడు, దావీదు దానిని వృద్ధిచేసికొన్నాడు. ఆ అధ్యాయంలో మిగిలిన భాగాన్ని చదివేటప్పుడు ఈ సంగతిని మనస్సులో ఉంచుకుందాం.

వచనం 14 యిలా ఆరంభమౌతుంది, "యెహోవా ఆత్మ సౌలును విడిచిపోయి ..." 16వ అధ్యాయంలోని చివరి భాగం సౌలు దావీదుల తారతమ్యాన్ని చూపుతోంది. తరువాత రాజుగా దేవుని అంగీకారాన్ని సూచించునట్లుగా, దేవుని ఆత్మ దావీదు మీదికి రాగా (16:13); అదే సమయంలో సౌలు నిరాకరింపబడినట్టు కనుపరచడానికి గాను యెహోవా ఆత్మ సౌలును విడిచిపోవడం జరిగింది. అది నిశ్చయం.[49]

అయినా, అప్పుడు, ఆశ్చర్యంగొలిపే ప్రతిపాదన చేయబడింది: "యెహోవా యొద్దనుండి దురాత్మయొకటి వచ్చి అతని వెరపింపగా ..." (అతని అంటే సౌలును) (16:14బి), "దుష్ట" అంటే పాప భరితమైన అని యిక్కడ అర్థం కాదు కాని "శిక్షించు" అనేది భావం. "దుష్ట" అనేది పాత నిబంధనలో తరచుగా "శిక్షను" సూచిస్తుంటుంది.[50] NKJVలో "బాధించు ఆత్మ" అన్నట్టు చెప్తుతోంది. "యెహోవా వద్దనుండి" అనడంలో సౌలును శిక్షించడానికి గాను దేవుడే నేరుగా ఈ ఆత్మను పంపియుండవచ్చు లేదా తన సేవకులలో ఒకనిని అపవాది పంపి (యోబు సంఘటనలా) అతని బాధించునట్లు అనుమతి యిచ్చి ఉండవచ్చు. ఏ విధంగానైనా, దేవునిది సదుద్దేశమనే విషయంలో మనం నిశ్చయంగా ఉండవచ్చు. తన దేవుని[51] వద్దకు తిరిగి వచ్చేలా సౌలు క్రమశిక్షణ కలిగి ఉన్నాడు.

అపవిత్రాత్మ సౌలు మీదికి వచ్చినప్పుడు, తన చుట్టు ఉన్నవారికి దాని ఫలితము విదితమైయుంది (16:15). సౌలు ఎల్లప్పుడు కొంత ఆస్థిరుడై ఉన్నట్టు కన్పిస్తుంది, అయితే అపవిత్రాత్మ అతని ఊగిసలాటను అధికం చేసింది; అతడెక్కువగా కుంగిపోయే సందర్భాలకు లోనయ్యాడు. సౌలుకు సలహాదారులు యిలా సిఫారసు చేశారు: "మా యేలినవాడవైన

నీవు ఆజ్ఞ ఇమ్ము, నీ దాసులమైన మేము సిద్ధముగా నున్నాము. సితారా చమత్కారముగా వాయింపగల యొకని విచారించుటకై మాకు సెలవిమ్ము. దేవుని యొద్దనుండి దురాత్మ వచ్చి నిన్ను పట్టినప్పుడెల్ల అతడు సితారా చేతపట్టుకొని వాయించుటచేత నీవు బాగు పడుదువని అతనితో ననిరి" (16:16). "సంగీతము క్రూర మృగాల్ని మైమరిపిస్తుంది" అని చెప్పబడింది.[52] అది సౌలు దినాల్లో నిజమే, మన దినాల్లోను అది నిజమే. ఒక వ్యాపారస్థుడు శాస్త్రీయ శైలి సంగీతాన్ని వింటూ విశ్రమించడమైనా, తల్లి తన బిడ్డకు వినిపించే లాలిపాటవల్లనైనా ఇది జరుగుతుంది.

సౌలు నిరాశపొందాడు; కనుక దేన్ని ప్రయత్నించడానికైనా సిద్ధంగానే ఉన్నాడు. "బాగుగా వాయింపగల యొకని విచారించి నా యొద్దకు తీసికొని రండని" సౌలు తన సేవకులకు సెలవిచ్చాడు (16:17).

దావీదుకు దాదాపు సమాన వయస్కుడును సితారా వాయించడంలో దావీదుయొక్క సామర్థ్యాన్ని ఎరిగిన ఒక యువకుడు సౌలు మనవిని ప్రక్కన నిలిచి విన్నాడు. అలా పరిస్థితులు కలిసిరావడం ఆశ్చర్యం కాదా? కావచ్చు గాని, అది పరిస్థితులు కలిసిరావడం కాదు. దేవుడు తన కరుణా హస్తమునుబట్టి, అణకువగానున్న గొర్రెలు కాచుకునే బాలుని రాజ నగరునకు నడిపించి, తాను రాజుగానుండ నేర్చుకొనడానికి పరిస్థితులను సమకూర్చుతున్నాడు. ఆ యువకుడు యిలా అన్నాడు: "–చిత్తగించుము, బేత్లెహేమీయుడైన యెష్షయియొక్క కుమారులలో ఒకని చూచితిని, అతడు చమత్కారముగా వాయింపగలడు. అతడు బహు శూరుడును యుద్ధశాలియు మాటనేర్పరియు రూపసియునై యున్నాడు, మరియు యెహోవా వానికి తోడుగానున్నాడనగా ..." (16:18), అది మనస్సుకు హత్తుకు పోయిన సందేశంగా ఉంది.[53] సౌలు దృష్టిలో ముఖ్యమైన అంశము: "చమత్కారముగా వాయించగలవాడు." అయితే, అతి ముఖ్యమైనది చివరి పద ప్రయోగము: "యెహోవా వానికి తోడుగానున్నాడు." యెహోవా ఆత్మ సౌలునొద్దనుండి వెళ్లిపోయాడు; అతనికి యితని దేవుడు అవసరమయ్యాడు.

వెంటనే సౌలు దావీదుకొరకు పంపాడు (16:19). అప్పుడు యెష్షయి ఒక గార్దభం మీద "రొట్టెలను ద్రాక్షారసపు తిత్తిని ఒక మేక పిల్లను వేయించి (16:20), తన కుమారుడైన దావీదుచేత సౌలునొద్దకు" పంపాడు (16:21).[54] 23వ వచనం యిలా అంటుంది: "దేవునియొద్దనుండి దురాత్మ వచ్చి సౌలును పట్టినప్పుడెల్ల దావీదు సితారా చేతపట్టుకొని వాయింపగా దురాత్మ అతనిని విడిచి పోయెను, అతడు సేదదీరి బాగాయెను."

దావీదు సితారా తీగెలు సౌలు మనస్సును నిమ్మళింపజేశాయి – అయితే దావీదు సితారా వాయించడానికిని అపవిత్రాత్మ వెళ్లిపోడానికిని గల సంబంధమేమి? ఆగి ఆలోచించు. దావీదు ఎలాటి పాటలను రాసాడు? "రాత్రియందలి నక్షత్రాలు ... పెద్దవి, ప్రకాశమానమైనవి ... యూదా హృదయపు లోలోపల ... అని రాసాడా"? లేక: "నేను నా ఉత్సాహాన్ని హాచిల్లా కొండమీద కోల్పోయానని"[55] ఉందా? మత సంబంధం కాని పాటలను దావీదు ఎప్పుడైనా రాసియుంటే, వాటిని గూర్చిన రికార్డు మనకు లేదు.[56] దేవుని గూర్చియు ఆయనతో తనకున్న సంబంధాన్ని గూర్చియు అతడు రాసాడు:

నీ చేతిపనియైన నీ ఆకాశములను
నీవు కలుగజేసిన చంద్రనక్షత్రములను నేను చూడగా,
మనుష్యుని జ్ఞాపకము చేసికొనుటకు వాడేపాటివాడు?
నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు?

ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి
అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది.

గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను
ఏ అపాయమునకు భయపడను.
నీవు నాకు తోడైయుందువు నీ దుడ్డు కర్రయు నీ
దండమును నన్ను ఆదరించును
(కీర్తనలు 8:3, 4; 19:1; 23:4).

గొర్రెల కాపరిగా ఉన్న ఒంటరి జీవితంలో దావీదు అనేక పాఠాలను నేర్చుకున్నాడు: అతడు నేర్చుకున్నవాటిలో అతి ముఖ్యమైనది దేవుని ఆరాధించడం. గొర్రెలను కాచే ఏకాంత భూముల్లో, దేవుని వాక్యాన్ని గూర్చియు, దేవుని లోకాన్ని గూర్చియు ఆలోచించినవాడై దేవుని ఆరాధించేవాడయ్యాడు. దేవుడైన యెహోవా సన్నిధికి రావడం గాలి పీల్చుకున్నంత సహజంగా మారిపోయింది.

నేటి మన గొప్ప అవసరాలలో ఒకటి – దేవుని ఎలా ఆరాధించాలో నేర్చుకొనడమే. మన దేవుని – నిజంగా ఆరాధించడం. క్రొత్త నిబంధనలో ఆరాధనను వ్యక్తపరచే విధానం పాత నిబంధనలో వ్యక్తపరచినట్టిది కాదు (ఉదాహరణకు, దావీదువలె, ఆరాధనలో క్రొత్త నిబంధన సంఘము సితారా అనే సంగీత వాయిద్యాన్ని ఉపయోగించలేదు), కాని ఆరాధించే హృదయం మాత్రం ఒక్కటిగా నిలిచియుంది. సమస్తమును నిర్మించినవాని సన్నిధికి పరిశుద్ధతతో కూడిన భయభక్తులు కలిగి, ఆయన మహా ఘనత ఎదుట వినయముగా సాగిలపడి, ఆయన ఆజ్ఞలపట్ల ప్రేమను అభినందనను యథార్థంగా వ్యక్తపరచాలి. "ఇశ్రాయేలు మధుర గాయకుని" (2 సమూ. 23:1) హృదయ పూర్వకంగా భక్తికి మరలవలసి వచ్చినప్పుడు, అలసిన ఆత్మలను ఉల్లాసపరచుకోడానికి ఆత్మసంబంధమైనవిగా కనబడే మాయలను అనేకులు ప్రచారం చేస్తారు.

దావీదు పాట, వాయిద్యము సౌలు వద్దనుండి అపవిత్రాత్మను ఎందుకు తోలివేసింది? సౌలు సమస్య మానసికమయ్యింది కాదు, అది ఆత్మకు సంబంధించిన వ్యాధి కనుక. దావీదు దేవుని గూర్చి పాడినప్పుడు, సౌలు హృదయము తాత్కాలికంగా దేవుని గూర్చిన ఆలోచనలతో నిండింది, మరియు బాధకు అతనిలో తావులేకుండాపోయింది.

"దావీదు బేత్లెహేములో తన తండ్రి గొఱ్ఱెలను మేపుచు సౌలునొద్దకు తిరిగి పోవుచు వచ్చుచు నుండెను" (17:15) అని తరువాత అధ్యాయం తెలుపుతుంది. మొదట్లో "అతనియందు సౌలునకు బహు ఇష్టము పుట్టెను" అని మొదటి సమూయేలు 16:21 అంటుంది. దేవుని కరుణా హస్తమునుబట్టి గొర్రెలు కాయు యువకునికి రాజుతో దగ్గర సంబంధం ఏర్పడింది, రాజ్యం నడిపించే విధానంతో పరిచయం ఏర్పడి, అధికారంలో ఉన్న జనుల గౌరవాన్ని అతడు సంపాదించుకున్నాడు. దావీదు కొరకైన దేవుని ఏర్పాట్లలో

యివన్నీ ముఖ్యమైనవే. దేవుని త్రోవలు ఆశ్చర్యమైనవి కావా?

## ముగింపు

ఈ పాఠంయొక్క ఆరంభంలో, ఫ్లోరెన్స్‌లో దావీదు విగ్రహాన్ని చూచిన సంగతిని చెప్పాను. గుడి కట్టుతున్న వర్క్ షాపులో మైకిలేంజిలిలో కరుకుగా పడియున్న ఒక చలువరాతి దిమ్మను చూచిన కథ చెప్పాను. సాధారణమైన ఓ శిల్పి ఒకవైపు కొంత భాగాన్ని కత్తిరించి, అది పాడైయ్యిందనే భావనతో పడేశాడట. ఆ రాయిని మైకిలేంజిలో తీసికొని “పాడై పోయిన” ప్రక్కను నైపుణ్యంగా మల్చి, ముందున్న రూపానికి తెచ్చాడు. తన సంపూర్ణ సామర్థ్యాన్ని తెలిపే దావీదుయొక్క శిల్పాన్ని మైకిలేంజిలో పనికిరానిదిగా పడవేయబడిన రాతినుండి చెక్కాడట.

నీ జీవితం పాడైపోయింది, అది పనికిరాకుండా పోయిందని నీవు నమ్మవచ్చు, కాని “దేవుని హృదయానుసారమైన” స్త్రీగా గాని, పురుషుడుగా గాని మారడానికి యిది మించిపోయినదేమీ కాదు. దావీదువలె నీ హృదయాన్ని నీవు దేవునికి సమర్పించు కున్నట్టయితే, దేవుడు నిన్ను తీసికొని, ప్రేమతో తన నేర్పుగల చేతులతో తన మహిమకు నిన్ను సాధనంగా మల్చుకోగలడు.

మనలో ప్రతి ఒక్కరు అటు దావీదును పోలియుండవచ్చు – లేదా సౌలును పోలియైనా ఉండవచ్చు. దేవుని ఆత్మ మనమీద నిలిచియుండవచ్చు.[57] లేక ఆయన మనలను విడిచిపోవచ్చు. నిర్ణయం మనదే.

---

## ప్రసంగము - దృశ్య సహాయాలు

**ప్రసంగపు నోట్సు:** దావీదును గూర్చిన పూర్వ చరిత్ర సమాచారం “ఎలా చేయాలి” అనే పాఠంగా తల్లిదండ్రులకు ఉపయోగించవచ్చు. “దేవుని హృదయానుసారునిగా ఎలా పెంచాలి” అనేలా పేరును మార్చవచ్చు. నొక్కి చెప్పదగిన కొన్ని విషయాలు యిక్కడ యివ్వబడ్డాయి. (1) ఆత్మసంబంధమైన స్థిరత్వాన్ని నీ బిడ్డకిమ్ము, (2) నీ బిడ్డకు బాధ్యతనిమ్ము, (3) ఆత్మ గౌరవాన్ని పెంపొందించుకునేలా నీ బిడ్డకు సహాయము చేయుము, (4) దేవుని ప్రేమించుట నీ బిడ్డకు నేర్పుము.

మొదటి పాఠంతో ఉపయోగించదగిన కీర్తన. 23. ప్రకృతిని గూర్చిన దావీదు కీర్తనలు దీనితో కలుపవచ్చు; కీర్తనలు 8; 19; 29 వంటివి.

**దృశ్య – సహాయముల నోట్సు:** దావీదు జీవిత ఆరంభ దినాలలోని పాలస్తీనా పటము ఉంది. దాన్ని పెద్దదిగా చేసి ఈ పాఠం చెప్పవచ్చు. నాలుగు మెయిన్ పాయింట్లను పరిచయం చేయడానికి కీలక పదాలను ఉపయోగించవచ్చు. ఒలీవ నూనెతో నింపబడ్డ ఆవు కొమ్ము పాఠానికి ఆసక్తి కలిగించే వృత్తాంతమై ఉంటుంది.

## సూచనలు

[1]ఏలనారంభించినప్పుడు దావీదు ముప్పై ఏండ్లవాడు (2 సమూ. 5:4). సౌలు నలభై సంవత్సరాలు ఏలాడు (అపో. 13:21). అంటే, సౌలు ఏలుబడిలో పదో సంవత్సరంలో దావీదు పుట్టియుంటాడన్నమాట. గనుక 1 సమూ. 13:14 ప్రవచనపు భూతకాలంలో వ్రాయబడినదైయుండాలి. అందులో భవిష్యత్తు భూతకాలంలో చెప్పబడింది. ఎందుకంటే, దేవుడు తెలుపునది నిశ్చయము గనుక, అది సంభవించినట్టే చెప్పబడవచ్చు. [2]1 సమూ. 28:17. [3]ఆది. 49:8–12. [4]రూతు 4:18–22. [5]పెరెసు యొక్క తల్లి తామారు (ఆది. 38). [6]రూతు 1:2, 19, 22; 2:4; 4:11. [7]1 సమూ. 17:12. దావీదు హృదయంలో బేత్లెహేముపైన ప్రత్యేక స్థానముంది; తరువాత కాలంలో అక్కడ బావి నీళ్లు త్రాగాలని అతడు కోరాడు (2 సమూ. 23:15; 1 దినవృ. 11:17). [8]1 సమూ. 17:12–14 ఎనిమిది మంది కుమారులను ప్రస్తావిస్తుంది, దావీదు కడసారివాడనేది వాస్తవం. 1 దినవృ. 2:13–15 ఏడుగురు కుమారులను మాత్రమే పేర్కొంటుంది. వారిలో ఒకడు చిన్నతనంలో చనిపోయి ఉండవచ్చు లేక సంతతిలేకుండా చనిపోయి ఉండవచ్చు. 1 దినవృ. 2:16, 17 ఇద్దరు అక్కచెల్లింద్రను గూర్చి చెప్పుతోంది. [9]"దావీదు" అనేది "*dawidh*" (Gk., *dabid*) అనే హెబ్రీ పదంనుండి వచ్చింది. "తన ప్రియుడు" లేక "యెహోవాకు ప్రియుడు" అనే దానియొక్క తక్కువ రూపమే దావీదు అని కొందరు భావిస్తారు. బైబిల్లో మరెవనికీ ఈ పేరు లేదు. [10]1 సమూ. 16:11.

[11]1 సమూ. 17:28. [12]దావీదు గొర్రెలను కాయవలసి వచ్చిందంటే, కుటుంబం పేదదైయుంటుంది (కలిగిన వారికి ఈ పని సేవకులచే చేయబడేది). దావీదు కాచిన మంద చిన్నదైయుంటుంది (1 సమూ. 17:28) – మరియు వారు సౌలునకు యిచ్చిన కానుక (అదే అయ్యుంటే), రాజునకు తగినంతది కాదు (1 సమూ. 16:20). 1 సమూ. 18:23 కూడా చూడు. [13]పసివాడుగా, పెద్దవారితో పనిచేసేటప్పుడు, నేను తరచుగా "low man on the totem pole" కష్టమైన, మురికి పనులు – గోదుమ నూర్పిడి, గడ్డికట్టే సమయం, లేక యింకా ఏదైనా నీ అనుభవంలో అలాటి కొన్ని ఉదాహరణలు నీకు ఉండవచ్చు. [14]మత్తయి 13:3–9, 18–23 చూడు. [15]గొర్రెల కాపరిగా బయట జీవించే కాలంలో దావీదుయొక్క విశ్వాసము ఎదిగి, బలపడిందనడానికి ఏ సందేహమూ లేదు. [16]సామెతలు 22:6; ఎఫెసీ. 6:4; మొదలైనవి. [17]కీర్తనలు 78:70–72 చూడు. [18]కొన్ని సార్లు కాపరులు కలిసి పని చేసేవారు (1 సమూ. 25:16; లూకా 2:8; వగైరాలను పోల్చి చూడు), అయితే మంద చిన్నదైనప్పుడు తరచుగా వారు ఒంటరిగానే పని చేసేవారు. [19]2 థెస్స. 3:10తో పోల్చి చూడు. [20]1 సమూ. 15:34; 7:17.

[21]Lynn Anderson, "The Heart of the Matter" (N.p., n.d.), sound cassette. [22]నోబులో సౌలు యాజకులను సంహరించినందున అతని భయము న్యాయంగా కన్పిస్తుంది – వారు దావీదును సపోర్టు చేసినట్టు తీర్మానించినప్పుడు (1 సమూ. 22:6–19). [23]1 సమూ. 7:15. [24]1 సమూ. 7:16. [25]"ప్రతిష్ఠించు" అంటే, "వేరుచేయడం" అని అర్థం. ఆచారాన్నిబట్టి వారు తమ్మును తాము శుద్ధి చేసికోవాలి. బలి అర్పించడానికి వారి హృదయాలను బ్రతుకులను సిద్ధం చేసికోవాలి. [26]1 రాజులు 19:21; మొదలైనవి. [27]వారు బలియర్పణకు వచ్చేవరకు యెష్షయి కుటుంబాన్ని సమూయేలు చూడకున్నందున, యెష్షయి అతని కుమారులు ఆహ్వానించబడడం మరియు సమూయేలుచే "ప్రతిష్ఠించబడడమనేది" (1 సమూ. 16:5), అధికారుల మూలంగానే జరిగియుంటుంది. [28]1 సమూ. 17:13 గమనించు, మిగతా యిద్దరు పెద్దవారు అబీనాదాబు, షమ్మాలను గూర్చి లేఖన భాగం మనకు తెలుపుతోంది. [29]1 సమూ. 16:7 "ఎత్తును అతని రూపమును," "పైరూపము" అనేవాటికి (అక్షరార్థం, "కన్నులు, ముఖము") గమనించు. [30]1 రాజులు 8:39; 1 దినవృ. 28:9; లూకా 16:15 గమనించు.

[31]Rick Atchley, "Here Comes the Judge" (N.p., n.d.), sound cassette. [32]మత్తయి 7:1ని సూచించి, క్రైస్తవులు ఎన్నడు తీర్పు తీర్చకూడదనే తీర్మానిస్తారు. మత్తయి 7:1–5 మానవ తీర్పులకు వ్యతిరేకమైన నిరోధం కాదు (తీర్పును ఉద్దేశించిన 6వ వచనం గమనించు). అయినా, మత్తయి 7:1ff. సమూయేలు తటాలున చేసిన తీర్పుకు వ్యతిరేకంగా మాట్లాడుతుంది. కఠినంగా చేయబడే తీర్పులకు వ్యతిరేకంగా కూడా అది నిలుస్తుంది. [33]1 దినవృ. 2:14, 15. [34]1 సమూ. 17:20ని గమనించు. [35]యెష్షయికి ఎడుగురు కుమారులున్నారు (ఏడు పరిపూర్ణ సంఖ్యగా యూదులు నమ్ముతారు) గనుక దావీదు ఎక్కువేనని కొందరు తలంచుతారు; యింకా యిద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. దావీదు "ఎదురు చూడని ఆశీర్వాదం" అయ్యుండవచ్చు. [36]దావీదు

పూర్వికులలో మోయాబీయురాలైన రూతు, మొదలైనవారు చేర్చబడ్డారు. [37]భోజనం బల్లచుట్టు ఏడుగురు పిల్లలు కూర్చున్న ఆ కుటుంబంలో, పరాక్రమ, శౌర్యాన్ని గూర్చి మాట్లాడుకుంటూ ఉంటుంటే, "నేను ఒక పద్యం వ్రాశానని" దావీదు వచ్చినట్టు నీవు చిత్రించుకో కోరవచ్చు. [38]కీర్తన. 16:10 "నా తల్లియు నా తండ్రియు నన్ను విడిచినను" అని తర్జుమా చేయవచ్చు. అయినా నా ప్రశ్న అలాగే నిలిచియుంటుంది. నేను పెదిగిన తల్లిదండ్రుల ప్రేమా వాతావరణంలో, వారు విడిచినా అనే అవకాశాన్ని గూర్చి నేను ఊహించలేకున్నాను. [39]దావీదు జన్మ చుట్టు ఒక సంకటం ఆవరించే అవకాశముంది. "దావీదు, అతని కుటుంబం" అనే వ్యాసాన్ని చూడు. [40]కొన్ని సందర్భాల్లో గొర్రెలు అలాగే విడిచిపెట్టబడతాయి (లూకా 2:16; 15:4లను పోల్చి చూడు).

[41]"... దావీదు సముఖంలో అతడు (సమూయేలు) నూనె తీసికొని, అతని అభిషేకించి, తన చెవిలో దేవుడు అతని రాజుగా కోరుకున్నట్టున్నూ, అతడు నీతిగా జీవించవలసినట్టున్నూ హెచ్చరించినట్టున్నూ" జోసీఫస్ అన్నాడు. Josephus, *Antiquities* 6.8.1 (61-65). [42]దావీదు మీదికి దేవుని ఆత్మ వచ్చినప్పుడు, దేవుని సంకల్పం అతనికి బయలుపరచబడియుండవచ్చు. [43]ఈలాటి ప్రతిపాదన పలు న్యాయాధిపతులను గూర్చి (సంసోనుతో సహా) చేయబడింది (న్యాయాధి. 14:6, 19; 15:14), సౌలు (1 సమూ. 10:6, 10; 11:6), యింకా యితరులను గూర్చి చెప్పబడింది. "నాటనుండి" అనే ప్రయోగాన్నిబట్టి యితరుల మీదికి వచ్చినట్టుకంటే దావీదు మీదికి ఆత్మ ఎక్కువ నిలకడగా ఉండడానికి వచ్చియున్నట్టు సూచించవచ్చు. [44]1 సమూ. 10:1తో పోల్చి చూడు. [45]వారి హృదయాలలో మందుతూ ఉంటుందన్నది నిస్సందేహం (1 సమూ. 17:28). [46]అనేక మూలాలనుండి ఈ ఉదాహరణలు అప్పుతేబడ్డాయి. [47]1 సమూ. 17:20, 28లను కూడా చూడు. [48]RSV చూడు. [49]సౌలు సమూయేలుచే రాజుగా అభిషేకింపబడిన తరువాత (1 సమూ. 10:1), యెహోవా ఆత్మ అతని మీదికి దిగి వచ్చాడు (1 సమూ. 10:10నుండి). [50]యోవేలు 2:13లో ఉపయోగింపబడిన హెబ్రీ పదం దుష్టులపై దేవుని శిక్షను సూచిస్తుంది. యోనా 3:10లో కూడా ఈ పదం ఉపయోగింపబడింది NASBలో అది "విపత్తు" అని తర్జుమా చేయబడింది.

[51]హెబ్రీ. 12:5-11 చూడు. సౌలు రాజుగా నిరాకరింపబడవచ్చు కాని, రక్షింపబడడానికి అతనికి యింకా ఆత్మ ఉంది. [52]William Congreve, as quoted in *Bartlett's Familiar Quotations,* 14th ed. (Boston: Little, Brown, and Co., 1968), 391. [53]16వ అధ్యాయం చివరి భాగాన్ని గూర్చి కాలక్రమ అమరికలో కొన్ని సమస్యలున్నాయి. సౌలు దావీదుల మధ్య ఉన్న పరిచయానికి లేక తొలి సంబంధానికి పరిచయంగా మనం ఆలోచించవచ్చు. వివరాలతో తరువాత కొన్ని అధ్యాయాలు నింపబడ్డాయి. ఇది వాస్తవమైనట్టయితే, 17వ అధ్యాయంలో గొల్యాతుతో జరిగిన యుద్ధం తరువాత ఈ దృశ్యం వస్తుంది–"బహు శూరుడును" "యుద్ధ శాలియు" అనే పదాలు సైనికుడుగా దావీదు ప్రాబల్యం పెంపారుటను ఆ పదాలు సూచిస్తున్నాయి. అయినా, దావీదు గొల్యాతును ఓడించక మునుపే వచ్చియున్నట్టయితే, దావీదు శూరత్వము, "యుద్ధశాలితనం" తన గొర్రెలను దుష్ట మృగములనుండియు, దొంగలనుండియు కాపాడిన సమాచారం జనుల మధ్య ప్రచారం పొందియుండవలసి ఉంటుంది. [54]1 సమూ. 16:21, 22లో అన్ని వేళలా "ఆయుధములు మోయువాడుగా" దావీదు సౌలు వద్ద ఉండేలా దావీదును తెచ్చుకున్నట్టు చెప్పుతోంది. అంటే, 1 సమూ. 18:2ను అది ఎదురు చూస్తుంది. [55]1 సమూ. 23:19. [56]2 సమూ. 1లోని సౌలు, యోనాతానులను గూర్చిన దావీదు గీతము "మత సంబంధము" కానిదైయున్నట్టు కొందరు అంటారు. ఏదియెలాగున్నా, ఎస్తేరు గ్రంథంలో దేవుని గూర్చిన ప్రస్తావనయే లేదు, అయినా "మత సంబంధం" కాని గ్రంథము అని అది అనబడడానికి దూరంగా ఉంటుంది. [57]అపొ. 2:38; గలతీ. 4:6.